క్లుప్తంగా

మావుళ్లమ్మకు సారె సమర్పణ



మావుళ్లమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మకు జేష్ఠ మాస జాతర సందర్భంగా గురువారం విశాఖ పట్టణానికి చెందిన హేమలత, భక్త బృందం సభ్యులు (30 మంది మహిళలు) సారె సమర్పించారు. గాజులు, పసుపుతో అలంకరించిన పాదాలు వివిధ రకాల పళ్లు, స్వీట్స్ తదితర వాటిని సారెగా సమర్పించారు. అనంతరం లలిత సహస్రనామ పారాయణం, కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా మావుళ్లమ్మకు ప్రత్యేకపూజలు చేశారు. సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ వారికి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ



విద్యార్థినికి సాయం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో 22వ వార్డులోని మున్సిపల్ స్కూల్‌కు హ్యాండ్ మైక్‌సెట్‌ను బహూకరించారు. ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ ద్వారా పేద విద్యార్థులకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. అనంతరం బీటెక్ విద్యార్థిని ఆకెళ్ల భార్గవికి రూ.25వేలు అందజేశారు. ముందుగా స్కూలు ఆవరణలోని మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలపాటి నారాయణ, కొత్త చంద్రశేఖర్ గుప్తా, సబ్బిశెట్టి శ్రీనివాస్ గణేష్, అనంత గోపాలం, నాగసూరి మురళీమోహన్ రావు, సమయమంతుల నాని, ఉప్పల నరసింహమూర్తి, ఆలపాటి భాస్కరరావు, వేముల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరుపాడులో 'నేను బడికి పోతా'



గ్రామంలో నేను బడికి పోతా అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ రవీంద్ర

కాళ్ల: బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించే విధంగా నేను బడికి పోతా కార్యక్రమం మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రవీంద్ర తెలిపారు. ఏలూరుపాడులో మండల పరిషత్ పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవీంద్ర మాట్లాడుతూ ఈ కార్యక్రమం జులై 12 వరకు నిర్వహిస్తారన్నారు. బడి ఈడు పిల్లలంతా బడిలో జాయిన్ అవ్వాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శివ నాగ జ్యోతి, అప్పారావు, వెంకన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ పనులకు విరాళం



ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ

ఆకివీడు/కాళ్ల: పంట, మురుగు కాల్వల అభివృద్ధికి విరాళాల సేకరణ చేపట్టిన ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజుకు రూ.లక్ష విరాళం చెక్కును ఆకివీడు జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు గురువారం అందజేశారు. పంట, మురుగు కాలువల్లో తూడు, గుర్రపు డెక్క, పూడిక పనులు చేపట్టేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసేందుకు తన వంతుగా ఎమ్మెల్యే రూ.5 లక్షల విరాళంతో ఖాతాను తెరిచారు.

రేపు జేఏసీ సమావేశం

నరసాపురం రూరల్: నరసాపురం మండల పరిషత్ ఆధీనంలోని మాధవాయిపాలెం ఫెర్రీకి సంబంధించిన ప్రస్తుత నిర్వాహణదారుడు సీహెచ్ఎస్‌వీ రెడ్డప్ప ధవేజీ మండలానికి చెల్లించాల్సిన బకాయిలను రాబట్టేందుకు, తదుపరి చర్యలు తీసుకునేందుకు గానూ జేఏసీ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రమణరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జేఏసీ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి నరసాపురం, సఖినేటిపల్లి మండలాల జేఏసీ సభ్యులు హాజరవుతారన్నారు.

రహదారులు జలమయం



ఆకివీడు: జెడ్పీ హైస్కూల్ సమీపంలో జలమయమైన జాతీయ రహదారి



ఉండి: రహదారి గోతిలో నిలిచిన వర్షపు నీరు

- నియోజకవర్గంలో 208.6 మి.మీ వర్షం
- రోజంతా కురుస్తున్న వర్షం



పాలకోడేరు: కుండపోత వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడుతోన్న వాహనదారులు

నియోజవకర్గంలో నమోదు అయిన వర్షపాతం

మండలం	తేదీ	వర్షపాతం
ఆకివీడు	27-6-2024	47.4
ఉండి	27-6-2024	68.8
పాలకోడేరు	27-6-2024	52.2
కాళ్ల	27-6-2024	40.2

ఆకివీడు: ఎట్టకేలకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం బుధవారం రాత్రి కురిసింది. గురువారం కూడా పగలంతా చినుకులతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. నైరుతి రుతు పవనాలు వీచిన తరువాత భారీగా వర్షం కురవడం ఇదే మొదటి సారి. గత 27 రోజులుగా నియోజకవర్గంలో నాలుగైదు రోజులు మాత్రమే అక్కడక్కడా చినుకులు పడ్డాయి. రోహిణీ కార్తెను తలపిస్తూ ఎండలు భగభగ మండిపోవడంతో ప్రజలు అల్లాడిపోయారు. వర్షాలు ఎప్పుడు కురుస్తాయోనని ఎదురు చూశారు. ప్రతీ రోజూ పగలు గ్రీష్మ తాపం, సాయంత్రానికి వాతావరణం చల్లబడినా వేడి మాత్రం తగ్గలేదు. ఉక్కబెట్టే వాతావరణంలో వృద్ధులు, చిన్న పిల్లలతో పాటు పెద్ద వాళ్లు కూడా ఒక్కిరి బిక్కిరయ్యారు. బుధవారం సాయంత్రం వాతావరణం మేఘావృతమయ్యింది. చినుకు చినుకు పడుతూ రాత్రి కుభవృష్టితో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. నియోజకవర్గంలో 208.6 మి.మీటర్ల వర్షం నమోదు అయింది.

రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీరు

కుండ పోత వర్షానికి పలు గ్రామాల్లోనూ, మండల, పట్టణ కేంద్రంలో రోడ్లు జలమయమయ్యాయి. రోడ్లపై భారీగా నీరు నిలబడిపోయింది. లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. స్థానిక నగర పంచాయతీలోనూ, పలు గ్రామాల్లో డ్రైయినేజీలను శుభ్రపరచడంతో కొంత మేర వర్షపు నీరు బయటకు చొచ్చుకుపోయింది. స్థానిక జాతీయ రహదారిపై భారీగా నీరు నిలబడిపోయింది. ఇండియన్ బ్యాంక్ దగ్గర నుంచి ఇండియన్ పెట్రోల్ బంకు వరకూ సుమారు పర్లాంగు దూరం రహదారి నీట మునిగింది. పలుచోట్ల తెల్లవారే సరికి డ్రైయిన్ల ద్వారా నీరు బయటకు పోయినప్పటికీ జాతీయ రహదారిపై వర్షపు నీరు బయటకు చొచ్చుకువెళ్లలేదు. ఈ ప్రాంతంలో భజన హోటళ్ల మురుగునీరు కలిసిపోయి, వర్షపు నీరు దుర్వాసనతో స్థానికులకు తీవ్ర ఇబ్బంది కల్గిస్తోంది. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు ఈ ప్రాంతంలో డ్రైయినేజీ సౌకర్యం లేకపోవడంతో తరచూ ముంపుకు గురవుతోంది. అదే విధంగా స్థానిక సెంట్‌ఎలోసియస్ స్కూల్‌వద్ద కూడా జాతీయరహదారిపై నీరు నిలబడిఉంది.

దమ్ము పనులకు అవకాశం

కుండ పోత వర్షంతో భూమి పూర్తిగా తడిసిపోయింది. కొన్నిచోట్ల పంట పొలాల్లో నీరు నిలబడి ఉంది. దీంతో గత నెల రోజులుగా రైతులు ఎదురు చూసిన దమ్ము పనులు ప్రారంభించుకునేందుకు అవకాశం ఏర్పడింది. పంట కాల్వల్లోకి నీరు వదిలినప్పటికీ అంతంత మాత్రంగానే నీరు రావడంతో దమ్ము పనులు ప్రారంభం కాలేదు. ముమ్మరంగా ఖరీఫ్ పనులు ప్రారంభానికి వర్షం దోహదపడుతుంది.

కుండపోత వర్షంతో ప్రయాణీకుల ఇక్కట్లు

పాలకోడేరు: బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పాలకోడేరు మండలంలోని పలు ప్రాంతాలు జల మయం అయ్యాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 165 జాతీయ రహదారిపై పెన్నాడ, గొరగనమూడి గ్రామాల్లో ఇటీవల వేసిన కంకర మొత్తం చెదిరిపోయి పెద్ద పెద్ద గోతులు పడి ప్రమాదకరంగా మారాయి. తాత్కాలికంగా కంకర వేసి వదిలి వేయడం వలన ఇలాంటి దుస్థితి ఏర్పడిందని సర్వత్రా విమర్శిస్తున్నారు.

ప్రయాణీకుల పాలిట శాపం.. ఉండి ఆర్వోబీ

ఉండి: మధ్యలోనే నిర్మాణం నిలిచిపోయి ఏళ్ల తరబడి నిర్మాణానికి నోచుకోని ఉండి ఆర్వోబీ (రైల్వే ఓవర్ (బ్రిడ్జ్) వలన ప్రస్తుతం దాని పరిధిలోని జాతీయ రహదారి (165) ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. గత రెండు రోజుల నుంచి పడుతున్న సాధారణ వర్షపాతానికే జాతీయ రహదారి ఛిద్రమయ్యింది. ఆర్వోబీ కట్టే సమయంలో రోడ్డు ధ్వంసం కావడంతో ఇప్పుడు ఆ ప్రాంతమంతా దారుణమైన గోతులుగా మారిపోయింది. జాతీయ రహదారి కావడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు గోతులను చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. కొందరు ఆ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఒక పక్క ఉండి పంట కాలువ మరో పక్క జాతీయ రహదారిపై తప్పించుకోలేనన్ని గోతులు ప్రయాణికులు, వాహనదారులకు ప్రాణాపాయంగా మారిపోయాయి. ప్రయాణానికి అనువైన దారి లేకపోవడంతో ఉండి పంట కాలువ పక్క వాహనాలు నడుపుతూ ప్రయాణికులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. అనునిత్యం స్కూల్ బస్సులు, ఆటోలు పదుల సంఖ్యలో తిరుగుతుండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకొని కనీసం గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టకపోతే వాహనాలు కాలువలో బోల్తా కొడతాయని, అటువంటి ప్రమాదాలు జరగక ముందే అధికారులు, ప్రజా ప్రతినిధులు అప్రమత్తం కావాలని పలువురు కోరుతున్నారు.

షిర్డీ సాయిబాబా ఆలయ వార్షిక మహోత్సవం

వీరవాసరం: మద్దాల రామకృష్ణమ్మ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వేంచేసియున్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ 15వ వార్షిక మహోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అన్నసమారాధన నిర్వహించారు. సాయినాధుడి ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణ, ప్రత్యేక పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయిబాబాకు ప్రీతిపాత్రమైన రోజు గురువారం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ నిర్వహకుల ఆధ్వర్యంలో స్వామి వారికి తెల్లవారు జాము నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు బాబా వారి మధ్యాహ్న హారతి కార్యక్రమం అత్యంత నయనానందకరంగా నిర్వహించారు. అనంతరం మహిళలచే విష్ణు సహస్రనామ పారాయణం, సాయినామ సంకీర్తనలు, భజనలు నిర్వహించారు. మండలంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన వీరవాసరం శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాదనలో భక్తులు వేలాదిగా పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు దగ్గరుండి పర్యవేక్షించారు. ఆయా కార్యక్రమాలలో కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

అత్తిలి: మండలంలోని ఉరదాళ్లపాలెం మెయిన్ రోడ్డు పై ఉన్న షిర్డీసాయి, శ్రీఅయ్యప్ప, శ్రీకనకదుర్గమ్మ, గణపతి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల 30వ వార్షికోత్సవాలు సందర్భంగా గురవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

పెనుగొండ: మానవత పెనుగొండ మండల శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం జరగనున్నట్లు మండల అధ్యక్షుడు నేమాని శ్రీనివాసరావు తెలిపారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు, కార్యదర్శిగా షేక్ మస్తాన్, కోశాధికారిగా యలమర్తి నరసింహారావు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. పెనుగొండ రెడ్డి కల్యాణ మండపంలో సాయంత్రం 5గంటలకు ప్రమాణ స్వీకారం జరగనుందని సభ్యులు హాజరు కావాలన్నారు.

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు



అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.సుజాత

ఆకివీడు: విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికెళ్లకూడదని ప్రిన్సిపాల్ కె.సుజాత పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడపలో వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్ని లక్ష్యంగా చేసుకొని హెరాయిన్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగానికి వారిని అలవాటే చేస్తున్నారని అటువంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు మీ చెంతనుంటే మీ ఆరోగ్యం భుగ్గిపాలవుతుందన్నారు. మీ జీవితం, మీ కుటుంబం నడి రోడ్డున పడుతుందని హెచ్చరించారు. కఠినమైన చట్టాలకు లోనుకావద్దని ఆమె హెచ్చరించారు. కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా వచ్చిన ఎస్‌బీయూ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె.కాత్యాయిని మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి మంచి అలవాట్లతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్ ఎస్‌ఐ యుగంధర్, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు బకాయిలు తక్షణమే చెల్లించాలి



తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

భీమవరం: రబీ బకాయిలు తక్షణమే చెల్లించి, ఎకరాకు రూ.20 వేలు సార్వాకు సాగు సాయమందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. రైతాంగం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు గురువారం భీమవరం తహసీల్దార్ శివకుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అను సంధానం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైపీ ఆనంద్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీపతి, తిరుమాని కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రతే వ్యాధులకు అడ్డుకట్ట అని దోమ పెరగకుండాను, దోమ కుట్టకుండాను చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని, దోమ కాటు నుంచి రక్షణ పొందాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక బేబి సెంటర్ సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో 9వ వార్డులో కుటుంబ సర్వే, కీటక జనిత ప్రదేశాల గుర్తించడం, సిబ్బందికి అవగాహన, మలేరియా మాసోత్సవాలపై అవగాహన సదస్సు, ర్యాలీలు జరిగాయి. డ్రై డే, ఫ్రై డే అవగాహన కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ దోమలు సమాజానికి ప్రథమ శత్రువులన్నారు. వీటి నియంత్రణ ఎంతో అవసరమని ప్రజలందరూ గుర్తించాలని కోరారు. చలితో కూడిన జ్వరం వస్తే వెను వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు టి.వెంకటలక్ష్మి, ఆశా వర్కర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై సీఐటీయూ నిరసన



పరిమెళ్ల రైతుభరోసా కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

పెంటపాడు: రబీ బకాయిలు తక్షణమే చెల్లించి, ఎకరాకు రూ.20 వేలు సార్వాకు సాగు సాయమందించాలని రైతుసంఘ, సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెంటపాడు మండలంలోని పరిమెళ్ల గ్రామంలోని రైతుభరోసా కేంద్రం ఆధ్వర్యంలో రైతుసంఘం, సీఐటీయు ఆధ్వర్యంలో స్థానిక రైతులతో కలసి నిరసన చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ మండల కార్యదర్శి చీర్ల పుల్లారెడ్డి, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు శిరపరపు రంగారావులు మాట్లాడుతూ 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అను సంధానం చేయాలని ఆయన కోరారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వీఆరోఏ సతీష్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు, పెనుగంటి దుర్గ, శ్రీను, తాడి సుబ్బయ్య, తాడిప్రసాద్, కవల బాలాజీ, మోఖమాట్ల గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాలలో కళాశాల హెచ్ఆర్డీ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ విద్యార్థులు హాజరు కావచ్చని వివరించారు. అపోలో ఫార్మసీ, పేటీఎం, యాక్సిస్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్ వంటి సంస్థలు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని ఇతర కళాశాలల విద్యార్థులు కూడా పాల్గొనవచ్చని చెప్పారు. వివరాలకు హెచ్ఆర్డీ సెంటర్ 94400 85679కు ఫోన్ చేయాలని సూచించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలు చర్చిస్తామని పేర్కొన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

పోడూరు: ఎల్‌పీజీ గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని స్థానిక హెచ్‌సీ గ్యాస్ ఏజెన్సీ డీలర్ పి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తమ గ్యాస్ కంపెనీ వద్ద చాలారోజులుగా ఈకేవైసీ ప్రక్రియ నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు 50 శాతం మాత్రమే పూర్తి చేసుకున్నారన్నారు. వినియోగదారుల సౌలభ్యం కోసం ప్రతిరోజూ మండల పరిధిలో ఏదొక గ్రామంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి ఈకేవైసీ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. జిన్నూరు గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి ప్రత్యేక శిబిరం నిర్వహిస్తామని, గ్రామంలోని ఎల్‌పీజీ వినియోగదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియోగదారులు తమ గ్యాస్ పుస్తకాలు తీసుకుని శిబిరాలకు వస్తే తమ సిబ్బంది ఈకేవైసీ ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

తణుకు అర్బన్: తణుకు ఆర్టీసీ డిపోలో నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ అన్నారు. తణుకు ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికులు పలు ఫిర్యాదులు, సూచనలు చేసినట్లు చెప్పారు. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించనున్నట్లు వివరించారు. రాష్ట్రపతి రోడ్డులోని ప్రభుత్వ ఆస్పత్రి గేటు ముందు బస్సులు నిలపడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, కొమరవరం, యర్రాయిచెర్వు, మహాలక్ష్మి చెర్వు, అంతెనగుంట, ఇరగవరం మీదుగా పల్లెవెలుగు బస్సు నడపాలని, వెన్నెల స్లీపర్ బస్సును తణుకు నుంచి బయలుదేరేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

ఎన్‌సీసీ విభాగానికి బల్లిపాడు జెడ్పీ హైస్కూల్ ఎంపిక



హెచ్ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎన్‌సీసీ స్టేట్ కల్నల్ ఎస్.ముఖర్జీ

అత్తిలి: పీఎంశ్రీ పాఠశాలలో భాగంగా తమ పాఠశాలలో ఈవిద్యా సంవత్సరం నుంచి ఎన్‌సీసీ విభాగం ఏర్పాటుకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎన్‌సీసీ స్టేట్ కల్నల్ ఎస్ ముఖర్జీ, కమాండెంట్ ఆఫీసర్ బృందం సందర్శించారు. ఈసందర్భంగా హెచ్ఎం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి 8వ తరగతికి చెందిన 25 మంది విద్యార్థులను ఎంపిక చేసి, వారికి ఎన్‌సీసీ శిక్షణ ఇస్తారన్నారు. ఎన్‌సీసీ-ఏ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్‌లో ఎన్నో ప్రయోజనాలు కల్గుతాయని, ఈఅవకాశాన్ని బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల సంస్కృత ఉపాధ్యాయుడు ఎస్ పురుషోత్తం మాట్లాడుతూ మండలంలో బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ శిక్షణకు ఎంపికకావడం విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీ రమేష్, జి శ్రీనివాస్, హర్ష, విజయ్, మాధవ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా హెలెన్ కిల్లర్ జయంతి వేడుకలు



భవిత సెంటర్ హెలెన్ జయంతి వేడుకల దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు సౌజన్యంతో హెలెన్ కిల్లర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హెలెన్ చిత్రపటానికి సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ కర్త సీహెచ్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ పీఎంవీకే జ్యోతిలు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. వక్తలు మాట్లాడుతూ కిల్లర్ పుట్టుకతో చెవిటి మూగ, అంధత్వంతో జన్మించి వైకల్యం అధిగమించి వాసన, స్పర్శ ద్వారా విద్యను అభ్యసించిందని, ఆమె జీవిత విశేషాలను విద్యార్థులకు వెల్లడించారు. డైమండ్స్ సేవలను కొనియాడారు. దివ్యాంగుల పిల్లలను తల్లిదండ్రులు తప్పక శిక్షణ అందించాలని కోరారు. భవిత కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక విద్యతో పాటు ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని, ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి సతీష్, కె.సాయి సత్యనారాయణ రాజు, ఆంజనేయ స్వామి, పల్లెల శేషగిరి, హెచ్ఎం జ్యోతి, ఎం.చంద్రకుమారి, తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత జీవనం గడపాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ భీమారావు

నరసాపురం రూరల్: ప్రజానీకం తగాదాల జోలికి వెళ్లకుండా శాంతియుత జీవనం గడిపేందుకు ప్రాముఖ్యతను ఇవ్వాలని, ఐకమత్యంగా గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని అడిషనల్ ఎస్పీ వి.భీమారావు అన్నారు. గురువారం రాత్రి మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని కొత్తపాలెం, శేరేపాలెం గ్రామాలకు నియమించే శాంతి కమిటీలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జిల్లాలో 2014,219,2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిశాయన్నారు. అయితే ఇటీవల జిల్లాలోని కొన్ని గ్రామాల్లో అశాంతికి గురిచేసే సంఘటనలు జరుగుతున్నాయన్నారు. కొత్తపాలెంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం, అభివృద్ధి సూచికలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన శిలాఫలకాలను కూల్చడం మంచి పద్ధతి కాదన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారు ఎంతటి వారైనా శిక్షిస్తామన్నారు. క్రిమినల్ కేసులు నమోదైతే విద్యార్థులు, నిరుద్యోగులు ఇతర దేశాలకు వెళ్లే అవకాశాన్ని కోల్పేయే ప్రమాదం ఉందన్నారు. కేసులు నమోదుకావడం వల్ల కలిగే నష్టాలను కమిటీ సభ్యులకు అడిషనల్ ఎస్పీ భీమారావు వివరించారు. ఇకపై ప్రతి గ్రామంలో శాంతి కమిటీల సభ్యులు శాంతిని నెలకొల్పేందుకు కృషి చేయాలన్నారు. డీఎస్పీ జి శ్రీనివాసరావు, సీఐ గోవిందరాజు, ఎస్సై వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పెనుగొండ: కోడి పందేల దిబ్బలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకుడు మాదాసు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండలో విలేకర్లతో మాట్లాడుతూ 2008లో ఇళ్ల స్థలాలు సేకరించి ఇంటి పట్టాలు పంపిణీ చేసినా మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. సుమారు 600 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నారని, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కాలనీలో చాల మంది ఇళ్లు నిర్మించుకోలేకపోయారన్నారు. దీంతో ఖాళీ స్థలాల్లో పొదలు పెరిగి అడవిలా మారిపోయాయన్నారు. పాముల భయం సైతం పెరిగిపోయిందన్నారు. వీధి దీపాలు, తాగునీరు లేక కాలనీవాసులు అందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి పొదలు తొలగింపుకు చర్యలు తీసుకుని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సమావేశంలో చింతపల్లి పద్మ, కాలనీ వాసులు పాల్గొన్నారు.